

శాప్ చైర్మన్‌గా రవి నాయుడు

- వివిధ కార్పొరేషన్ల మెంబర్లుగా పరసా, ఊకా సహా ఐదుగురు
- తిరుపతి జిల్లాలో ఆరుగురికి తొలి విడత నామినేటెడ్ పదవులు

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో తిరుపతి జిల్లా నుంచీ ఆరుగురు టీడీపీ నేతలకు చోటు దక్కింది. తిరుపతికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిమిని రవినాయుడు శాప్ (ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) చైర్మన్‌గా ఛాన్సు కొట్టేశారు. మిగిలిన ఐదుగురూ వివిధ కార్పొరేషన్లలో మెంబర్లుగా పదవులు దక్కించుకున్నారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో తిరుపతి టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్, సత్యవేడు టీడీపీ నేత డాక్టర్ వి.చందన స్రవంతి మెంబరు పదవులను పొందారు. సూళ్ళూరుపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత, మాజీ మంత్రి పరసా రత్నం మార్క్‌ఫెడ్ మెంబరు పదవి పొందగా నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గంజి మాధవయ్య, వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గంగాధర శ్రీరామదాసు ఏపీ పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ మెంబర్లుగా పదవులు దక్కించుకున్నారు.



ఊకా విజయకుమార్, పరసారత్నం, చందన స్రవంతి, గంగాధర శ్రీరామదాసు, గంజి మాధవయ్య

యువ నాయకుడి కష్టానికి గుర్తింపు

తిరుపతికి చెందిన రవినాయుడికి శాప్ చైర్మన్ దక్కడంతో యువ నాయకుడి కష్టాన్ని అధిష్ఠానం గుర్తించినట్టయింది. సామాన్య కార్యకర్తగా పార్టీతో ప్రయాణం మొదలుపెట్టి అంచెలంచెలుగా రాష్ట్రస్థాయికి ఎదగడంతోపాటు పార్టీ భావినేత నారా లోకేశ్ వెంట నిలవడం ఇతడికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. 2005లో ఓరియంటల్ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ చైర్మన్‌గా విద్యార్థి రాజకీయాల్లో అడుగుపెట్టిన రవినాయుడు తర్వాత టీఎన్ఎస్ఎఫ్‌లో చేరి చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా, ఎస్వీయూ ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు అధ్యక్షుడిగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ కమిటీ సమన్వయకర్తగా పనిచేశారు. 2020లో తిరుపతి తెలుగుయువత పార్లమెంటు అధ్యక్షుడిగా నియమితులైన ఆయన 2021లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ, రాష్ట్ర కార్యక్రమాల సమన్వయకర్తగానూ నియమితులయ్యారు. యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మొదటి దశలో వలంటీర్ల కో ఆర్డినేటర్‌గానూ, రెండవ దశలో యాత్ర కో ఆర్డినేటర్‌గానూ పనిచేయడం రవినాయుడిని లోకేశ్ టీమ్ మెంబరును చేసింది. అధినేత చంద్రబాబు అక్రమ కేసులో అరెస్టయిన సందర్భంగా ఆయన సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరిట చేపట్టిన యాత్రకు కూడా రవినాయుడు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలతో అధినేత కుటుంబానికి చేరువయ్యారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో హత్యాయత్నం, ఎస్సీ అట్రాసిటీ తదితర కేసులతో సహా మొత్తం 57 కేసులు నమోదైనా, ఆ కేసుల్లో అర్ధరాత్రిళ్ళు అరెస్టయినా, ఎన్నోసార్లు గృహ నిర్బంధాలకు లోనైనా వెరవకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేయడాన్ని పార్టీ అధిష్ఠానం గుర్తించింది. ఈ నేపథ్యంలో శాప్ చైర్మన్ వంటి రాష్ట్రస్థాయి పదవి దక్కడం పార్టీ శ్రేణులకు కూడా సానుకూల సంకేతాన్ని, సందేశాన్ని ఇచ్చినట్టయింది.

తొలి విడతలో టీడీపీ నేతలకే ఛాన్సు

తొలి విడత నామినేటెడ్ పదవుల్లో తిరుపతి జిల్లా నుంచీ కేవలం టీడీపీ నేతలకే అవకాశం దక్కింది. జిల్లాలో ఆరు నియోజకవర్గాలుండగా మొదటి దఫా చేపట్టిన పదవుల భర్తీలో తిరుపతి, వెంకటగిరి, సూళ్ళూరుపేట, సత్యవేడు నియోజకవర్గాలతో పాటు నగరి పాక్షిక నియోజకవర్గ నేతలకు అధిష్ఠానం గుర్తింపు కల్పించింది. ఈ దఫా శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల నేతలెవరికీ అవకాశం రాలేదు. కాగా ప్రభుత్వం ప్రకటించిన తాజా పదవుల జాబితాలో జిల్లా నుంచీ టీడీపీ మినహా కూటమిలోని ఇతర మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలకు అవకాశం రాలేదు. తొలి జాబితాలో ప్రకటించింది కేవలం 20 కార్పొరేషన్లు మాత్రమే కావడం, ఇంకా భర్తీ చేయాల్సిన పదవులు బోలెడు వుండడంతో మలి విడతలో ఆ పార్టీల నేతలకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.

చిత్తూరు జిల్లాకు ఏదీ సముచిత స్థానం..?

- ఒక్కరికీ దక్కని కార్పొరేషన్ చైర్మన్ పదవి

చిత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు నామినేటెడ్ పదవుల్లోనూ తొలివిడతలో సముచిత స్థానం దక్కలేదు.20 కార్పొరేషన్లకు చైర్మన్ పదవుల్ని భర్తీ చేయగా.. జిల్లాకు ఒక్కటీ కేటాయించలేదు.ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం,టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలతకు మాత్రమే అవకాశం దక్కింది.నగరి నియోజకవర్గంలోని పుత్తూరు మాజీ ఎంపీపీ గంజి మాధవయ్యకు పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం లభించింది. ఈయన ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రకాష్ వెన్నంటే ఉంటూ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డారు. దీంతో పార్టీ గుర్తించి పదవి ఇచ్చింది.



● పీఎస్ మునిరత్నానికి గౌరవం

కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉన్నారు. చంద్రబాబుతో కలిసి ఎస్వీయూలో చదువుకోవడంతో పాటు ఆయన కుప్పంలో పోటీ చేస్తున్నప్పటి నుంచి వెంటే నడుస్తున్నారు. గతంలో రెస్కో చైర్మన్‌గా పనిచేశారు. ఆయన సీనియారిటీని గుర్తించి ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు.అయితే కుప్పంలో సీనియర్ నాయకుల్ని గౌరవించడంతో పాటు కొత్తవారికి కూడా అవకాశం కల్పించాలని అక్కడి టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందినప్పుడు.. సమీక్ష నిర్వహించిన చంద్రబాబు ఇక కొత్తవారిని ప్రోత్సహిస్తానని హామీనిచ్చారు. దీంతో నామినేటెడ్ పదవులపై కొత్తతరం నాయకులు ఆశలు పెట్టుకున్నారు. వచ్చే జాబితాలో అయినా తమ పేర్లుంటాయని ఆశిస్తున్నారు.

● డైరెక్టర్ పోస్టుకు హేమలత పరిమితం



చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత అత్తామామలు కటారి అనురాధ, మోహన్ 2016లో హత్యకు గురయ్యారు. అత్త మేయర్ పోస్టులో ఆమె పనిచేశారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భర్త ప్రవీణ్ కరోనా సమయంలో మరణించి ఈమెను ఒంటరిగా మార్చారు. గత ఐదేళ్లలో వైసీపీ వేధింపుల్ని దీటుగా ఎదుర్కొని టీడీపీ కోసం శ్రమించారు. శ్రేణుల్ని కాపాడుకున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశావహుల్లో ఈమె కూడా ఒకరిగా నిలిచారు.ఈమెకు ఏదైనా పెద్ద పదవే లభిస్తుందని అనుకుంటుండగా టూరిజం డైరెక్టర్ పోస్టుకు పరిమితం చేశారు.



పోలేరమ్మ (ఫైల్ ఫొటో)

పోలేరమ్మ జాతరకు పోదాం రండి..

- వెంకటగిరిలో నేడు, రేపు వేడుక
- భారీగా తరలిరానున్న భక్తులు

వెంకటగిరి, సెప్టెంబరు 24: ప్రతిష్ఠాత్మక వెంకటగిరి పోలేరమ్మ జాతరకు దశాబ్దాల చరిత్ర ఉంది. స్వరూపిణిగా వర్ధిల్లుతున్న అమ్మవారి జాతరకు విదేశాల్లో స్థిరపడ్డ స్థానికులు సైతం వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బుధ, గురువారాల్లో కోలాహలంగా ఈ వేడుక జరగనుంది. ఇక్కడ కొలువుదీరిన పోలేరమ్మ భక్తకోటి మొక్కులు అందుకోవడం వెనుక విశేషముందని స్థల పురాణం చెబుతుంది. 1913లో కలరా మహమ్మారి వెంకటగిరిని అతలాకుతలం చేసింది. భారీగా ప్రాణాలను బలితీసుకుంది. దీంతో వెంకటగిరి సంస్థానాధీశులు ప్రజారక్షణకు శీతల యాగాన్ని నిర్వహించారు. శిలలను పొలిమేరల్లో ప్రతిష్ఠించారు. నాడు ప్రతిష్ఠించిన శీతల రాళ్లకు ఏటా పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తామని సంస్థానాధీశులు పోలేరమ్మకు మొక్కుకున్నారు. కలరా కనుమరుగైన నేపథ్యంలో నాటి నుంచి సంస్థానాధీశుల ఆధ్వర్యంలో పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముందు 1714లో కూడా ఇక్కడ పోలేరమ్మ జాతర జరిగిందని చరిత్ర చెబుతోంది. వినాయకచవితి తర్వాత మొదటి బుధవారం అర్ధరాత్రి దాటాక మొదటి చాటింపు వేయించారు. రెండో చాటింపు తర్వాత ఆదివారం అమ్మవారికి ఘనంగా ఘటోత్సవం నిర్వహించారు. గాలిగంగల మండపంలో రెండు మట్టికుండలను ఉంచి పూజలు చేశారు. ఆ కుండలను పోలేరమ్మ తల్లి అత్తగారి నివాసమైన చాకలివీధికి తరలించారు. పవిత్రమైన ఆ కుండలకు భక్తులు నమస్కరించి అంబళ్లు పోశారు. ఘటం కుండలు ప్రతి ఇంటా పూజలందుకోవడంతో జాతర సందడి మొదలయ్యింది. మూడో చాటింపుతో బుధవారం అమ్మవారు భక్తుల దర్శనార్థం కొలువుదీరుతారు. రెండు రోజుల పాటు వైభవోపేతంగా జాతర నిర్వహిస్తారు. గురువారం అమ్మవారిని ఊరేగించే విరూపోత్సవంతో పోలేరమ్మ జాతర ముగుస్తుంది.

చిన్నారుల మడి భిక్షాలతో వినూత్న శోభ

వెంకటగిరి టౌన్ : పోలేరమ్మ జాతర సందర్భంగా చిన్నారులు కొత్త వస్త్రాలను ధరించి మడి భిక్షాలకు బయల్దేరడం ఆనవాయితీ. 'పోలేరమ్మకు మడిభిక్షం పెట్టండి... పోతురాజుకు టెంకాయ కొట్టండి... పగలకపోతే నా నెత్తిన కొట్టండి' అంటూ చిన్నారులు ఇంటింటా తిరుగుతూ జాతరకు కొత్త శోభ తీసుకొస్తారు. ఇళ్లలో వేపమండలను తోరణాలుగా అలంకరిస్తారు. పసుపుతో పోలేరమ్మ ప్రతిమను తయారు చేసి, భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. బంధువులందరికీ అంబలి పంచుతారు. బుధవారం మొలకెత్తిన నవధాన్యాలు, వేపమండలు, వెయ్యికళ్ల దుత్తలను పోలేరమ్మ తల్లి ప్రతిమ వద్ద ఉంచి మహిళలు పూజలు నిర్వహిస్తారు. మంగళవారమే భక్తులు, బంధువుల సందడి మొదలైంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భారీగా భక్తులు రావడం ప్రారంభమైంది. భక్తుల రద్దీ నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.



హర్షవర్ధన్‌రాజు

సిట్ సభ్యులుగా ఇద్దరు పూర్వ ఎస్పీలు



గోపీనాథ జెట్టి

- ఏఎస్పీ వెంకట్రావు, సీఐ రామ్‌కిషోర్ కూడా
- నెయ్యి కల్తీపై విచారణకు ప్రభుత్వ నియామకం

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. అందులో ఇదివరకూ జిల్లాలో పనిచేసిన ఇద్దరు ఎస్పీలు వుండడం విశేషం. సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)కు గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అధిపతిగా వ్యవహరించనుండగా విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సభ్యులుగా వ్యవహరించనున్నారు.తిరుపతి అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు, అలిపిరి సీఐ రామ్‌కిషోర్, మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కూడా సిట్‌లో సభ్యులుగా నియమితులు కానున్నారు. కీలక అధికారులైన గోపీనాథజెట్టి, హర్షవర్ధనరాజు గతంలో తిరుపతి జిల్లాలో పనిచేశారు. వీరిలో గోపీనాథజెట్టి గత టీడీపీ ప్రభుత్వంలో రెండున్నరేళ్ళ పాటు తిరుపతి అర్బన్ ఎస్పీగానూ, తర్వాత టీటీడీ సీవీఎస్వోగానూ పనిచేశారు. ఇక హర్షవర్ధన్‌రాజు ఈ ఏడాదిలోనే స్వల్ప కాలం పాటు జిల్లా ఎస్పీగా పనిచేశారు. గోపీనాథజెట్టి మునుపు తిరుపతి అర్బన్ ఎస్పీగాగానూ, టీటీడీ సీవీఎస్వోగానూ పనిచేసి వున్నందున టీటీడీ సెక్యూరిటీ సహా పాలనా వ్యవహారాలపై లోతైన అవగాహన వుంది. అందుకే ప్రత్యేకంగా ఆయనను ఏరికోరి ప్రభుత్వం సిట్‌లో నియమించింది. ఇక హర్షవర్ధన్‌రాజు నిజాయితీపరుడిగానూ, ముక్కుసూటిగానూ పనిచేస్తారన్న పేరుంది. అందుకే ఆయన తిరుపతి ఎస్పీగా నియమితులైన స్వల్ప కాలానికే ప్రభుత్వం కడప జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. ఒత్తిళ్లకు లొంగరన్న పేరున్న కారణంగా ఆయనను సిట్‌లో నియమించినట్టు సమాచారం. వీరు సభ్యులుగా వున్న సిట్ శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణలపై దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

విషాదం

శనగ్గింజ గొంతులో ఇరుక్కుని మూడు నెలల చిన్నారి మృతి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24:గొంతులో వేరుశనగ గింజ ఇరుక్కుని మూడు నెలల చిన్నారి మృతి చెందిన దురదృష్టకర ఘటన మంగళవారం తిరుపతి రూరల్ మండలం వినాయకనగర్‌లో చోటు చేసుకుంది. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు...వినాయకనగర్‌లో కాపురమున్న మేస్త్రీ రాజేష్,జయంతి దంపతులకు మూడు నెలల కుమార్తె వుంది.రెండ్రోజుల క్రితం జయంతి వరండాలో మంచంపై నిద్రిస్తుండగా పక్కింట్లో వుంటోన్న జయంతి అన్న కుమారుడు శాంతన్ ఆడుకుంటూ వచ్చి తాను తింటున్న వేరుశనగ గింజను పాప నోట్లో వేసి తినమని చెప్పాడు. ఆ గింజ గొంతులో అడ్డుపడడంతో పాపకు ఊపిరాడక గిలగిలా కొట్టుకుంది.గమనించి వెంటనే రుయాస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ పాప పరిస్థితి మెరుగుపడకపోవడంతో చెన్నై ఎగ్మోర్ ఆస్పత్రికి తీసుకెళ్ళారు.అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం పాప మృతి చెందింది.

వామ్మో..ఎంత పెద్ద పామో!



తిరుమల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):తిరుమలలో మంగళవారం సుమారు 10అడుగుల పొడవైన పాము పట్టుబడింది. వీఐపీలు బసచేసే పద్మావతి ఏరియాలోని లలితసత్యం అతిథిగృహానికి సమీపానికి వచ్చిన ఈ పామును చూసిన భక్తులు, సిబ్బంది హడలిపోయారు. వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

సేవ్ తిరుమల సేవ్ టీటీడీ



టీటీడీ కార్యాలయంలోకి వెళ్లేందుకు పోలీసులతో స్వామీజీల వాగ్వాదం

- కల్తీ నెయ్యిపై హిందూ సంఘాల నిరసన

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'సేవ్ తిరుమల- సేవ్ టీటీడీ' నినాదం తిరుపతిలో హోరెత్తింది. కల్తీ నెయ్యి దోషులను కఠినంగా శిక్షించాలంటూ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు మంగళవారం ఉదయం నిరసన దీక్ష చేపట్టారు. ఛలో తిరుపతి పేరిట చేపట్టిన ఈ కార్యక్రమంలో 'తిరుమల క్షేత్రాన్ని కాపాడుకుందాం...శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని పరిరక్షించుకుందాం. కల్తీ దొంగలను వెంటనే శిక్షించాలి. జగన్మోహన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి' వంటి నినాదాలు చేశారు. దాదాపు ఇరవైమంది స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు తరువాత ఈవో శ్యామలరావును కలిశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. తిరుపతిలో వేలాది ఎకరాల హథీరాంజీ భూములు ఉన్నాయని అక్కడ పెద్దఎత్తున గోశాలలు ఏర్పాటుచేయాలని కోరారు. తద్వారా వచ్చే నెయ్యిని శ్రీవారికి వినియోగించాలన్నారు. ఈ అంశాలను పరిశీలిస్తామని ఈవో హామీ ఇవ్వడంతో నిరసన విరమించి వెనుదిరిగారు. ఈసందర్భంగా స్వామీజీలు మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.320 రూపాయలకు కిలో నెయ్యి ఎక్కడైనా వస్తుందా? వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి, ధర్మారెడ్డి ఎవరిని మోసం చేయాలని కల్తీ నెయ్యి తెప్పించారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో తిరుమలను వ్యాపారకేంద్రంగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నదానంలో పురుగులు పట్టిన అన్నం పెట్టారని, చంటి బిడ్డలకు పాలు కూడా ఇవ్వలేకపోయారని, టీటీడీ వెబ్‌సైట్‌లో శిలువ గుర్తులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని, యావత్ హిందువులను క్షమించమని కోరితే క్షమిస్తారని చెప్పారు. లేకుంటే వైసీపీ నాయకులను హిందూ సమాజం వెలివేస్తుందని, శ్రీనివాసుడి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసా నంద సరస్వతి స్వామి (శ్రీకాకుళం), భైరవానంద స్వామి (ఒంగోలు), మహదేవానంద స్వామి (కామా రెడ్డి), శివానంద స్వామి (మహబూబ్ నగర్), తిరుపతికి చెందిన గణేష్ స్వామి, ఓంకార్, కిరణ్, బండ్ల లక్ష్మీపతి, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో

ట్రయల్ రన్ సక్సెస్

27న వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం



చంద్రగిరి, సెప్టెంబరు 24: చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో ట్రయల్ రన్ విజయవంతమైంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ సౌండ్ అండ్ లైటింగ్ షోను ఈనెల 27న సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. మంగళవారం రాత్రి ట్రయల్ రన్ నిర్వహించారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పర్యాటక శాఖ, లక్స్ అండ్ డెసిబెల్స్ భాగస్వామ్యంతో సంయుక్తంగా పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ విధానంలో రూ.6 కోట్లతో లైట్స్ అండ్ సౌండ్‌ను ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్‌ను పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణప్రసాద్, కేంద్ర ఆర్కియాలజీ సబ్ సర్కిల్ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ తిలకించారు. ఆరేళ్ల తర్వాత చంద్రగిరి కోటకు పూర్వ వైభవం రానుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు

తిరుమల,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపు నిర్వహించింది. ఈ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 65,604 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,266 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

భవిత కేంద్రం సందర్శన

భాకరాపేట, సెప్టెంబరు 24: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్యను అందిస్తున్నట్లు జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు ఎంపీపీ పాఠశాలలో భవిత కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల పిల్లలకు ప్రత్యేక విద్యతోపాటు ఫిజియోథెరపీ సేవలు, ఎస్కార్టు అలవెన్సులు, రవాణా ఛార్జీలు, ట్యాబ్ ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, సహిత విద్య ఉపాధ్యాయులు వెంకటరమణ, ఎం.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- టీటీడీ అధికారులకు మంత్రి ఆనం ఆదేశం

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి టీటీడీ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని శ్రీకృష్ణ అతిథిగృహంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై మంత్రి టీటీడీ అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఈవో శ్యామలరావు మంత్రికి వివరించారు. భద్రత విషయంలో తిరుమలలో చేపట్టిన ఏర్పాట్లు, గరుడసేవకు అందనపు సిబ్బందిని నియమిస్తున్నట్టు తెలిపారు. భక్తులకు ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తామన్నారు. ఇంజినీరింగ్, వసతి, కల్యాణకట్ట, వైద్య, ఆరోగ్య, రవాణా, హిందూ ధర్మప్రచార పరిషత్ తదితర విభాగాలు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గరుడసేవకు చేపట్టే చర్యలను కూడా వివరించారు. మంత్రికి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు.మంత్రి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలో మూలమూర్తిని దర్శించుకున్నారు. అదనపు ఈవో శ్రీవారి లడ్డూప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాలను అందజేశారు. అంతకుముందు మంత్రి శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.


టీటీడీ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సంస్కృత భాషలో మంచి పరిశోధనలు

- కేంద్రీయ సంస్కృత వర్సిటీ వీసీ

తిరుపతిరూరల్, సెప్టెంబరు24: సంస్కృతభాషలో భావితరాలకు అవసరమైన పరిశోధనలు చేయాలని న్యూఢిల్లీకి చెందిన కేంద్రీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్ వర్కేడి సూచించారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్‌పై రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉత్తమ పరిశోధనలు రూపొందించడంపై దృష్టిసారించాలని ఆకాంక్షించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పరిశోధకులకు భారతీయ జ్ఞాన పరంపరకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు సదసు నిర్వహించామన్నారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, సాహిత్యసంస్కృతి డీన్ ప్రొఫెసర్ లలితారాణి, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగ హెడ్ ప్రొఫెసర్ శివరాం ఆర్.భట్, ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్‌మీనా, ప్రొఫెసర్ సోమనాథ్ దాస్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్, వేదికపై జీఎస్ఆర్ కృష్ణమూర్తి

కమీషన్లు తీసుకోలేదని ప్రమాణం చేయాలి

- భూమనకు కిరణ్‌రాయల్ సవాల్

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి) భూమన కరుణాకర్‌రెడ్డి తన హయాంలో ఇంజినీరింగ్ పనుల్లో 10, 20 శాతం కమీషన్ల వాటా తీసుకోలేదని ప్రమాణం చేయాలని జనసేన నేత కిరణ్‌రాయల్ సవాల్ విసిరారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన లడ్డూవడ పట్టుకుని ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భూమన చేసిన పనులకు ఇప్పటికీ టీటీడీలోని కొందరు ఇంజినీరింగ్ అధికారులు నోటీసులు తీసుకుని బాధపడుతున్నారన్నారు. ప్రమాణం చేయాల్సింది చివరి తొమ్మిది నెలలు ఉన్న భూమన కాదన్నారు. జగన్, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిలు ప్రమాణం చేయాలన్నారు. వీరి ఆధ్వర్యంలోనే పాపాలు జరిగాయన్నారు. ఇవి పాపాలు పోవాలంటే వీరు దేశంలోని నదులన్నీ తిరగాలన్నారు. శ్రీవారికి జగన్ తలనీలాలు సమర్పించి లడ్డూవడతో ప్రమాణం చేయాలన్నారు. తమ అధినేత పవన్‌కల్యాణ్ 11 రోజుల దీక్ష తీసుకున్న సందర్భంగా తాము కూడా సంఘీభావంగా ప్రాయశ్చిత్త దీక్షకు పూనుకున్నామన్నారు. అనంతరం ఆలయం అఖిలాండం చేరుకున్న కిరణ్‌రాయల్‌ను పోలీసులు అడ్డుకున్నారు. రాజకీయాలు మాట్లాడకూడదంటూ అక్కడ నుంచి ఆయనను తిరుపతికి పంపారు.



22 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు యువకుల అరెస్టు

ఏర్పేడు, సెప్టెంబరు 24: ఏర్పేడులో సోమవారం అర్ధరాత్రి పోలీసులు 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఆవరణలో రేణిగుంట ఇన్‌చార్జి డీఎస్పీ నరసింహమూర్తి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏర్పేడు సీఐ జయచంద్ర తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి ఏర్పేడు-వెంకటగిరి క్రాస్‌లో తనిఖీలు చేపట్టారు. తిరుపతి భవానీనగర్‌కు చెందిన టి.నరసింహ రోహిత్(22), ఏర్పేడు మండలం మన్నసముద్రానికి చెందిన బి.నవీన్ బైక్‌లో వస్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. మేర్లపాక సమీపంలోని పద్మావతి హోటల్ వెనుక గంజాయి పొట్లాలుగా కట్టి ఏర్పేడులో విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. తిరుపతికి చెందిన మునిభరణి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నామని, ప్రస్తుతం అతను తిరుపతి జైలులో ఉన్నాడని చెప్పారు. నిందితుల నుంచి 22 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.9వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మునిభరణి గంజాయి ఎక్కడి నుంచి తెప్పిస్తున్నాడు.. ఎవరెవరికి విక్రయిస్తున్నాడు వంటి వివరాలపై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ నరసింహమూర్తి

కాలానుగుణంగా పంట మార్పిడి

రామచంద్రాపురం, సెప్టెంబరు 24: కాలానుగుణంగా పంట మార్పిడి చేపట్టాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు కోరారు. సొరకాయలపాలెం పంచాయతీ చల్లావారిపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పశువులకు సీజన్‌లో వచ్చే వ్యాధుల నివారణపై పశుసంవర్ధకశాఖ డీడీ ఉమామహేశ్వరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో స్రవంతి, ఉద్యానశాఖ అధికారి సునీల్, పశువైద్యాధికారి జయకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్యాహ్న భోజనం పరిశీలన

రామచంద్రాపురం, సెప్టెంబరు 24: గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ మంగళవారం తనిఖీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో ఏఎంవో శివశంకర్

మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో మండలి పూజ



చంద్రగిరి, సెప్టెంబరు 24: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం మండలి పూజను వేడుకగా నిర్వహించారు. అమ్మవారి కొత్త ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం గత నెల 7 నుంచి 9వ తేది వరకు మూడు రోజులు వైభవంగా జరిగింది. కుంభాభిషేకం నిర్వహించి 41 రోజులు పూర్తి చేసుకొన్న సందర్భముగా ఆగమ శాస్త్ర ప్రకారం మండల పూజ(శాంతి హోమము) వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈవో రామకృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మత్తు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ



చంద్రగిరి, సెప్టెంబరు 24: మత్తుకు బానిస కాకుండా యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. మంగళవారం చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికల్ షాప్, ప్రయివ్రేటు, ఆర్‌ఎంపీ డాక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో, ప్రైవ్రేటు వైద్యశాలల్లో మత్తు కలిగించే మాత్రలు, ఇంజెక్షన్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇవి రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయివ్రేటు వైద్యులు తమ పరిధికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఇంజెక్షన్లు, డ్రగ్స్, మత్తు మాత్రలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మత్తు పదార్థాలపై సమాచారం తెలిస్తే పోలీస్ వాట్సాప్ నంబర్... 8099999977, లేదా డయల్ 100, 112 నెంబర్లకు సమాచారం అందించాలని స్థానికులను కోరారు. ఎస్‌ఐ అనిత పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'తో రైతాంగానికి మేలు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, టీడీపీ నేతలు

తిరుచానూరు, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అమిలినేని మధు అన్నారు. తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ వేమూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయరంగం నిర్వీర్యమైపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి మమత పలు అంశాలపై రైతాంగానికి వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు మధుశేఖర్ సురేంద్రనాయుడు, కళావతి, మునికృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగిరెడ్డిపల్లిలో అల్లాజెండా ఊరేగింపు



రామచంద్రాపురం, సెప్టెంబరు 24: గంగిరెడ్డిపల్లెలో మంగళవారం రాత్రి మేళతాళాల నడుమ అల్లా జెండా ఊరేగింపు వైభవంగా జరిగింది. గ్రామంలో జ్వరాలు, పశువ్యాధులు సంభవించినపుడు హిందువులంతా ఏకమై 9 రోజుల పాటు అల్లా జెండా ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల 19 నుంచి 27 వరకు జెండా ఊరేగింపు నిర్వహిస్తారు. 27న మసీదు వద్ద సామూహిక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

తిరుమలలో భవన కార్మికుడి మృతి

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ భవన కార్మికుడు మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. ఈనెల 19వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో రాంభగీచ విశ్రాంతి భవనానికి సమీపంలో 53 ఏళ్ల వయసున్న వ్యక్తి అచేతనంగా ఉండటాన్ని అక్కడి స్థానికులు, వ్యాపారులు గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్‌లో తరలించారు. అశ్విని ఆస్పత్రి సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈక్రమంలో వన్‌టౌన్ పోలీసులు చేరుకుని మృతుని వద్ద ఆధార్‌కార్డు గుర్తించారు. మృతుడు కడప కందిమలయ్యపల్లికి చెందిన దూదేకుల సిద్దయ్యగా తెలిసింది. పోలీసులు అక్కడ సంప్రదించగా బంధువులెవరు లేనట్టు తెలిసింది. పదేళ్లుగా తిరుమలలో భవన కార్మికుడిగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. పోలీసులు మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96771 నంబరుకు సమాచారమివ్వాలని కోరారు.


సిద్దయ్య మృతదేహం

అంకితభావంతో భక్తులకు సేవలు

- టీటీడీ అదనపు ఈవో

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగులందరూ భక్తుల్లో శ్రీవారిని దర్శిస్తూ అంకితభావంతో సేవలు అందించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో మంగళవారం జరిగిన బ్రహ్మోత్సవాల ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆలయ, వసతి విభాగాల ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రపంచ నలుమూలల నుంచి రోజూ వేలాది మంది భక్తులు దర్శనానికి వస్తుంటారన్నారు. విభిన్న ప్రాంతాలు, భాషలు, సంస్కృతికి చెందిన వ్యక్తులతో సేవా భావంతో ఉద్యోగులు మెలుతుగూ కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. యాత్రికులకు వివిధ కార్యకలాపాల గురించి తెలిపేందుకు టీటీడీ సమస్త సమాచారం తెలుసుకోవాలన్నారు. తద్వారా యాత్రికుల దృష్టిలో సంస్థ ప్రతిష్ఠను మెరుగుపరచడానికి ఈ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. బ్రహ్మోత్సవాలకు అందరు సన్నద్ధం కావాలన్నారు. తర్వాత ఉద్యోగుల అభిప్రాయాలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవోలు లోకనాథం, హరీంద్రనాథ్, భాస్కర్, ఆశాజ్యోతి, చీఫ్ పీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

పాకాల, సెప్టెంబరు 24: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాకాల పంచాయతీ పారిశుధ్య సిబ్బంది కుటుంబ సభ్యులకు మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. బీపీ, షుగర్, రక్త కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కస్తూరి, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోతీ టీడీపీ నాయకులు కనకరాజ్, డి.మోహన్ నాయుడు, రావిళ్ల మోహన్, ఇలియాస్,రమణ, రాజేంద్ర, సురేష్, జియాఉద్దీన్, వీఆర్వో లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి


ఎస్వీ వ్యవసాయ కళాశాలలో మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ రమణ

పాకాల, సెప్టెంబరు 24: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డ్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, బాలాజీనగర్ పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఏరివేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో మాశిలామణి, అధ్యాపకులు చిట్టికళావతి, మోహన్ బెహర, ఆదిశేఖర్ రెడ్డి, రమణమ్మ, రేఖ, మాధవి, వినోద్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచి సేవాభావాన్ని అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ పి.గణేష్‌కుమార్, డాక్టర్ విశైలజ, డాక్టర్ పి.శాంతి, డాక్టర్ బి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

భాకరాపేట, సెప్టెంబరు 24: సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ, చిట్టేచర్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి రైతులతో చర్చించారు. మామిడిలో పాటించవలసిన మెళకువలు, ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ పిచికారి విధానం రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి శివకుమారి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సర్వసతి, సర్పంచులు విజయకుమార్, నాగచంగమ నాయుడు, కృష్ణమూర్తి, జశ్వంత్, సహదేవరెడ్డి, చంద్రారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి గ్రామ అవసరాలకు వినియోగించండి

భాకరాపేట, సెప్టెంబరు 24: భాకరాపేట గ్రామ సర్వే నెం.329లోని ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకే ఉపయోగించాలని మండల వైస్-ఎంపీపీ సునీత కోరారు. గ్రామస్థులతో కలిసి ఆమె మంగళవారం గ్రామ కార్యదర్శి రామ్మోహన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ప్రస్తావించిన సర్వే నంబరులో ప్రభుత్వ భూమి కోసం మాజీ సైనికులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే ఇళ్ల స్థలాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఆ భూమి తప్ప వేరే ఎక్కడా భూమి లేదన్నారు. ఈనేపథ్యంలో గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఆ భూమిని ఇతరులకు ఇవ్వకుండా నిలుపుదల చేయాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా ప్రజా అవసరాలకు కేటాయించమని కోరామన్నారు. టీడీపీ నాయకులు దామోదర్, లోకనాథం, యశ్వంత్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన


కరపత్రం అందజేస్తున్న సాల్మన్‌రాజు,పార్టీ నేతలు

తిరుచానూరు, సెప్టెంబరు 24: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని తిరుపతి రూరల్ మండల టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాల్మన్‌రాజు అన్నారు. పార్టీ నాయకులతో కలిసి మండలంలో మంగళవారం వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన వివరాలను తెలిపే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు సమాంతరంగా సాగుతున్నాయన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పెద్దమొత్తంలో పెంచి ఇస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మునస్వామిరెడ్డి, కలీముల్లా, జీవన్‌కుమార్, సీతాపతి తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రాపురం:** గంగిరెడ్డిపల్లి పంచాయతీ పద్మవల్లిపురంలో మంగళవారం ఇది మంచిప్రభుత్వం కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు, అధికారులు వందరోజుల పాలన గురించి వివరిస్తూ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవరత్నం, మునెయ్య, కుప్పారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

బస్సు పాసింగ్ మాడ్యుల్‌పై శిక్షణ

తిరుపతి (ఆర్టీసీ), సెప్టెంబరు 24: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రజారవాణాధికారి కార్యాలయంలో మంగళవారం బస్సు పాసింగ్ మాడ్యుల్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల సిస్టమ్స్ సూపర్‌వైజర్లకు విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ఎస్.జమీర్ శిక్షణ ఇచ్చిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఈడీ చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే రద్దీ దృష్ట్యా ప్రయాణీకులకు సురక్షిత, సౌకర్యవంతమైన రవాణా కల్పించాలని ఆదేశించారు. ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్, 11 జిల్లాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పద్మావతి జూనియర్ కాలేజీలో స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ డీఈవో నాగరాజ నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24: పద్మావతి జూనియర్ కాలేజీలో స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభమైంది. టీటీడీ డీఈవో నాగరాజ నాయుడు సమక్షంలో ప్రిన్సిపాల్ భువనేశ్వరీదేవి నూతన కమిటీని మంగళవారం ప్రకటించారు. అంతకు ముందు కొత్తగా నిర్మించిన క్లాస్‌రూములను ఆయన ప్రారంభించారు. సంతోషిమాత సంస్థ డైరెక్టర్ ప్రసాదరావు కాలేజీకి ఎల్‌ఈడీ టీవీని వితరణ చేశారు. వార్డెన్ స్నేహలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24: ఎస్వీయూ హాస్టల్ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యక్షుడిగా హరిదాసు, ప్రధాన కార్యదర్శిగా షణ్ముగం, సహాయ కార్యదర్శిగా మురళీకృష్ణ, కోశాధికారిగా కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గజేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగరాజు, ఆడిటర్‌గా రాజేశ్వరి, గౌరవ అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు, గురువారెడ్డి ఎన్నికయ్యారు.

27నుంచి ఎస్జీఎఫ్ అండర్ 19 క్రీడల ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 24: ఈనెల 27నుంచి 30వరకు ఎస్జీఎఫ్ అండర్ 19 క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరుజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జయరామయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ● సెపకతక్రాకు 27న ఉదయం 9.30గంటలకు రేణిగుంట జెడ్పీహైస్కూల్‌లో ● సాఫ్ట్‌బాల్‌కు 28న మధ్యాహ్నం 2గంటలకు చంద్రగిరి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ● కబడ్డీకి 30న మధ్యాహ్నం 2గంటలకు తుమ్మలగుంట మైదానంలో పోటీలు జరగనున్నాయి. ఆసక్తిగల విద్యార్థులు పదవ తరగతి మార్కుల లిస్టు, స్టడీసర్టిఫికెట్, ఆధార్ జిరాక్సులను తీసుకురావాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులని, మరిన్ని వివరాల కోసం 93936 21004 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆచరణాత్మకంగా ఉండాలి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 24: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీ ఆచరణాత్మకంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా అధికారులను మంగళవారం ఆదేశించారు. జిల్లాలోని అన్ని డివిజన్, మున్సిపల్, మండల, గ్రామ, వార్డు సచివాయాల అధికారులతో వర్చువల్ విధానంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందించిన గోడపత్రికలను ముఖ్యకూడళ్లల్లో, బ్యాంకులు, సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించాలన్నారు.

పారదర్శక పాలన ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యం

'ఇది మంచి ప్రభుత్వం'లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పారదర్శక పాలన ఎన్డీయే కూటమి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం సాయంత్రం రైల్వేకాలనీలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు బాధలు పడ్డారన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పని చేస్తోందని ఆమె తెలిపారు. శ్రీవారి పాదాల చెంత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి కోనేటిలో మునిగి ప్రమాణం చేస్తే చేసిన పాపాలు పోవని పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్ విమర్శించారు. కార్పొరేషన్ నిధులన్నీ భూమన అభినయ్ రెడ్డి దోచుకున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆరోపించారు. శ్రీవారి కైంకర్యాలలో అవినీతికి పాల్పడిన వారికి భగవంతుడు సరైన శిక్ష విధిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, క్లస్టర్ ఇంచార్జిలు మునిశేఖర్ రాయల్, పుష్పావతి, మన్నెం శ్రీనివాసులు నాయుడు, ఆర్సీ శ్రీనివాస్, ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, జనసేన నాయకులు పొలకల మల్లికార్జున్, రాజా రెడ్డి, మునస్వామి, రాజేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుగుణమ్మ

త్వరలోనే ఐదుగురికి జైలు ఖాయం

● అఖిలాండం వద్ద శ్రీవారికి క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 24: త్వరలోనే ఐదుగురు వ్యక్తులు జైలుకు వెళ్లడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్‌లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, అప్పటి ఈఓ ధర్మారెడ్డి, పొన్నవోలు సుధాకరరెడ్డిలకు జైలు తప్పదన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదాలను కల్తీచేసి కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారందరికీ శిక్ష తప్పదన్నారు. అయితే ఆ ఐదుగురు నిందితుల కుటుంబాలకు మాత్రం ఎటువంటి హాని కలుగకుండా చూడాలని శ్రీవారిని ప్రార్థించారు. 2019లో నెయ్యి సరఫరాకు సంబంధించి రివర్స్ టెండరింగ్ చేశారని, దానివల్లే అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. ఇందుకు జగన్‌మోహన్‌రెడ్డే కారణమని చెప్పారు. లడ్డూ ప్రసాదాల కల్తీ విషయాన్ని పూర్తిస్థాయిలో విచారించేందుకు ముఖ్యమంత్రి సిట్ వేశారని, కల్తీలో సూత్రధారులు, పాత్రధారులు, లబ్ధిదారులు అన్ని విషయాలు నిగ్గుతేలుతాయన్నారు. ఇప్పటికైనా ఐదుగురు వ్యక్తులు అఖిలాండం వద్ద తప్పు చేశామని ఒప్పుకుని, శ్రీవారికి క్షమాపణలుచెప్పి, చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకోవాలని హితవు పలికారు. అఖిలాండంవద్ద కరుణాకరరెడ్డి హైడ్రామా చేశారని, దీనిపై కేసులు పెట్టినందుకు టీటీడీ అధికారులను భానుప్రకాష్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. తిరుమలలో ధార్మిక విషయాలు కాకుండా రాజకీయాలు ఎవరు మాట్లాడినా కేసులు నమోదుచేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పొన్నగంటి భాస్కర్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రుయా, స్విమ్స్‌లో పొగాకు వాడుక నిర్మూలన కేంద్రాలు ప్రారంభం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 24 : పొగాకు ఉత్పత్తుల వాడకం వలన జీవితాలు నాశనమవుతాయని, పొగాకును ఏ విధంగా వాడినా అనర్థాలు తప్పవని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేశవ్యాప్తంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా వర్చువల్ పద్ధతిలో యువత కోసం పొగాకు రహిత ప్రచారం 2.0ను ప్రారంభించారు. అనంతరం పొగాకు నియంత్రణ దిశగా ప్రజలకు వైద్యం, కౌన్సెలింగ్ వంటి వాటిని అందించాలని ఆయన వర్చువల్లో పేర్కొన్నారు. సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో రుయాస్పత్రిలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాధలు కలిసి పొగాకు వాడుక నిర్మూలన కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే స్విమ్స్‌లో సైకియాట్రి విభాగాధిపతి గణేష్‌కుమార్, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉషాకళావత్ సైకియాట్రి విభాగంలో పొగాకు వాడుక నిర్మూలన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉండి పొగాకు వాడకం వలనే కలిగే దుష్పలితాలను, దాని నివారణ మార్గాలను గురించి వివరిస్తారన్నారు. పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుయాలో సిబ్బంది కొరత వల్లే రోగులకు ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 24: రుయాస్పత్రిలో పడకలకు సరిపడ ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు లేకపోవడం వలనే రోగులకు కొంత ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుయాస్పత్రిలో ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు అందుబాటులో లేకపోవడం వలన రోగుల సహాయకులే రోగులను స్ట్రెచ్చర్, వీల్‌చైర్లలో తీసుకువెళుతున్న విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో దయ లేని రుయా శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆమె ప్రతీ వార్డులో రోగులకు సాయంగా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ప్రాధాన్యతా రంగాలకు రుణాలు మంజూరు చేయండి



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 24: బ్యాంకర్లు వ్యవసాయం, విద్య, ఎంఎస్ఎంఈ వంటి ప్రాధాన్యతా రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి బ్యాంకు అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులతో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ బ్యాంకర్లు విద్యారంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుని రుణాలు మంజూరు చేయాలన్నారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శిబిరాలను నిర్వహించాలని చెప్పారు. ఎల్డీయం విశ్వనాథరెడ్డి, ఆర్‌బీఐ ఎల్‌డీవో పూర్ణిమ, యూనియన్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్ఎం రామప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులతో సామాజిక న్యాయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో సామాజిక న్యాయం చేసిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో అసలైన కార్యకర్తలకు అగ్ర తాంబూలం ఇచ్చారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. అధిక భాగం నామినేటెడ్ చైర్మన్ పోస్టులు రిజర్వేషన్ వర్గాలకే కేటాయించడం పట్ల ఆనంద్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులు పొందిన వారికి ఆయన అభినందనలు తెలిపారు.

పుత్తూరు వార్తలు

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు




జడ్పీ సీఈవో, మున్సిపల్ చైర్మన్ సత్కరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 24: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రవికుమార్ నాయుడిని ఎమ్మెల్యే సత్కరించారు. పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మంజునాథ గౌడ కూడా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ తహసీల్దార్ అశోక్ రెడ్డి, వడమాలపేట డీటీ సుధీర్ రెడ్డి, ఆర్ఐ జానీబాషా కూడా ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

మాజీ ఏజీ పొన్నవోలు వ్యాఖ్యలు అభ్యంతరకరం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు



మీడియా సమావేశంలో విజయబాబు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వ్యాఖ్యలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు ఆక్షేపించారు. మంగళవారం పుత్తూరులో తన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల లడ్డూ విషయంలో పనికిమాలిన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. పంది కొవ్వు విలువను బంగారంతో, ఆవు నెయ్యి విలువను రాగితో పోల్చడాన్ని దుయ్యబట్టారు. బంగారంతో పోల్చిన పందికొవ్వును ఇంటికి తీసుకెళ్లి మీరు తినే ఆహారంలో వినియోగించుకోవాలని సూచించారు. పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ధనపాల్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు అరవ ప్రకాష్, మధుసూదన్ రాజు, మణికంఠ పాల్గొన్నారు.

దివాలా పిటిషన్ దాఖలు

పుత్తూరు, సెప్టెంబరు 24: పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో స్థానిక ఎస్‌బీఐ కాలనీకి చెందిన ఎస్.కృష్ణమూర్తి అనే వ్యక్తి దివాలా పిటిషన్ దాఖలు చేశారు. తమిళనాడులోని తిరుత్తణిలో తన టెక్స్‌టైల్ వ్యాపారం కొవిడ్ కారణంగా దెబ్బతినడంతో పాటూ చిట్టీల వ్యాపారంలో నష్టపోయానని పేర్కొన్నారు. ఎనిమిది మందికి రూ.20 లక్షలకు ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చానని తెలిపారు. ఇలా ఉండగా ముందస్తు ప్రణాళికలతోనే తన స్థిరాస్తులను విక్రయించి ఐపీ పెట్టారని, భవిష్యత్తు కోసం దాచుకున్న తమ చిట్టీ సొమ్ములు పోయాయని బాధితులు విలపించారు.

పవన్ ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావం



పుత్తూరు, సెప్టెంబరు 24: సనాతన ధర్మ పరిరక్షణ కోసం డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా నగరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఎం.మహేష్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణకు ప్రజల్లో పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఉపేంద్ర, దేవా, స్వామినాధన్, కటికం నాగార్జున, గజేంద్ర, కోమలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ముగ్గురికి కాంస్యం



వడమాలపేట, సెప్టెంబర్ 24: రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించినట్లు పీడీ చంద్రశేఖర్ రాజు తెలిపారు. తిరుపతిలో జరిగిన అండర్ 14 జూడో పోటీల్లో వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వెన్నెల, లీలా(32 కిలోలు), షణ్ముగం(50 కేజీలు) ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ముగ్గురు కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి

వడమాలపేట, సెప్టెంబర్ 24: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారి విజయకుమార్ చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం వడమాల, లక్ష్మమ్మకండ్రిగల్లో సాగుపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో వివిధ పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

ఇది మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ



వడమాలపేట, సెప్టెంబర్ 24: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన పై మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఇళ్ల గోడలపై స్టిక్కర్లు అతికించారు. మంగళవారం మండలంలో లక్ష్మమ్మకండ్రిగ, పూడి, బాలినాయుడు కండ్రిగ, పత్తిపుత్తూరు పంచాయతీల పరిధిలో కార్యక్రమాలు జరిగాయి.

మున్సిపల్ కమిషనర్‌కు టీడీపీ నాయకుల సన్మానం



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 24: పుత్తూరు మున్సిపల్ నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మంజునాథ గౌడను మంగళవారం టీడీపీ నాయకులు సత్కరించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతు పుత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, నాయకులు డీజీ ధనపాల్, బాబునాయుడు, కౌన్సిలర్ కేశవాచ్చారి, గోపి ఆచారి, బిఆర్. మురళీ, ఈశ్వరయాదవ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భానుకు మాధవయ్య కృతజ్ఞతలు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 24: పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గంజి మాధవయ్య నియమితులైనారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ సిఫారసు మేరకు రాష్ట్రప్రభుత్వం ఆయన్ను పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. గంజి మాధవయ్య జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా, పుత్తూరు ఎంపీపీగా, గొల్లపల్లి పీహెచ్‌సీ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా మాధవయ్య మాట్లాడుతూ... ఈ పదవికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌స్పైర్ మనక్‌తో నూతన ఆవిష్కరణలు: డీఈవో



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 24: ఇన్‌స్పైర్ మనక్‌తో నూతన ఆవిష్కరణలు సాధ్యమని డీఈవో శేఖర్ తెలిపారు. మంగళవారం బాలికల ఉన్నత పాఠశాలలో పుత్తూరు డివిజన్ సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనక్‌పై ఆగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, నేషనల్, గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో మాట్లాడుతూ... నూతన ఆవిష్కరణలు, శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు ఇన్‌స్పైర్ మనక్ దోహదం చేస్తుందన్నారు. ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు, ఎంఈవోలు తిరుమలరాజు, బాల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

26న జాబ్‌మేళా

గూడూరు అర్బన్, సెప్టెంబరు 24: స్థానిక ఐటీఐ కళాశాలలో ఈనెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం తెలిపారు. పదో తరగతి నుంచి బీటెక్ పాస్ అయిన వారు అర్హులన్నారు. వివరాలకు 8639835953 నంబరు సంప్రదించాలన్నారు.

హెల్మెట్లు ధరించండి

తడ, సెప్టెంబరు 24: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం అపాచీ సెజ్‌రోడ్డు వద్ద ద్విచక్ర వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సీఐతో పాటు ఎస్ఐ కొండపనాయుడు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

వాకాడు, సెప్టెంబరు 24: మండలంలోని బాలిరెడ్డిపాళెం విద్యార్థి ధరణికోట మహేష్ ఉన్నత చదువుల కోసం సీతారామ ధార్మికసేవాసంస్థ ఆధ్వర్యంలో నాగలాపురం గిరిధర్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులు రూ.6వేలు అందజేశారు.

పోలేరమ్మ గుడిలో సంప్రోక్షణ పూజలు



సంప్రోక్షణ పూజలో ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 24: గ్రామశక్తి పోలేరమ్మ గుడిలో మంగళవారం ఉదయం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారి స్వర్ణ పాదాలకు సంప్రోక్షణ చేశారు. సుమారు గంట పాటు సాగిన ఈ పూజా కార్యక్రమం పండితుల మంత్రోత్సాహాల నడుమ ఘనంగా జరిగింది. అనంతరం అమ్మవారిని దర్శించుకొన్న ఎమ్మెల్యే రామకృష్ణ తొలి దర్శన టికెట్లను ఈవో శ్రీనివాసులురెడ్డి ద్వారా కొనుగోలు చేశారు. ఈ ఏడాది తొలిసారి వీఐపీ పాసులు రద్దు చేశారు. దీంతో అందరూ టికెట్టు తీసుకొని అమ్మవారి దర్శించుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. కాగా, సాయంత్రం 6 గంటలకు వెంకటేశ్వర ప్యాలేస్ సెంటరు నుంచి పోలేరమ్మ దేవస్థానం మీదుగా జగన్నాథపురం వారిచే కాంతారా బృందం నృత్య ప్రదర్శన వైభవంగా నిర్వహించారు.

జగన్ తీరుతో తిరుమలకు అప్రతిష్ట: కురుగొండ్ల



దక్కిలి, సెప్టెంబరు 24: మాజీ సీఎం జగన్ తీరుతో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల అప్రతిష్టపాలైందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యాఖ్యనించారు. దక్కిలిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యి కల్తీకి జగన్ బాధ్యత వహించా లన్నారు. టీటీడీ బోర్డులో అన్యమతస్థులు, నేరస్థులను నియమించడం వల్లే ఇలాంటి దారుణాలు చోటు చేసుకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను కించపరిచే విధంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, అధికార ప్రతినిధి ఆరికట్ల శ్రీరాములు, నాయకులు దక్కిలి చంద్రారెడ్డి, అయ్యపరెడ్డి తదితరులు పాల్గొన్నారు

మొదలైన జాతర సందడి

● నేడు చిన్నారుల మడిభిక్షాలు
● అమ్మవారి విగ్రహం తయారీ




పూజలందుకుంటున్న పోలేరమ్మ శిలాప్రతిమ - ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 24: వెంకటగిరి పట్టణంలో గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందడి నెలకొంది. బుధవారం చిన్నారులు మడి భిక్షాలకు బయలుదేరడంతో రెండు రోజుల జాతర మహోత్సవానికి శ్రీకారం చుడుతారు. సంప్రదాయ ప్రకారం చిన్నారులు తలంటు స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలను ధరించి మడిభిక్షాలకు బయల్దేరుతారు. 'పోలేరమ్మకు మడిభిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి.. పగలకపోతే నా నెత్తిన కొట్టండి' అంటూ మడిభిక్షం ఎత్తుకుని చిన్నారులు ఇంటింటా తిరుగుతూ జాతరకు ఆహ్వానం పలుకుతారు. ఇళ్లలో వేపమండలను తోరణాలుగా అలంకరిస్తారు. పసుపుతో పోలేరమ్మ ప్రతిమను తయారు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. అంబలి తయారు చేసి బంధువులందరికీ పంచి పెడుతారు. బుధవారం మొలకెత్తిన నవధాన్యాలు, వేపమండలు, వెయ్యికళ్ల దుత్తలను పోలేరమ్మ తల్లి ప్రతిమ వద్ద ఉంచి మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం వీటిని పోలేరమ్మ సన్నిధానంలో అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మున్సి పాలిటీ, దేవదాయశాఖ, ఆలయ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పట్టణంలో అమ్మవారి ఊరేగింపు జరిగే రాజవీధిలో చెట్ల కొమ్మలను తొలగించే పనులను పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేయడం దాదాపు పూర్తి చేశారు. లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. స్థానికులు ఇళ్లకు రంగులు వేయడం, దూర ప్రాంతాల్లో స్థిర పడిన బంధువులను, స్నేహితులను జాతరకు ఆహ్వానించడంలో నిమగ్నమయ్యారు. సంచార దుకాణాలు, రంగులరాట్నం, ఎగ్జిబిషన్‌లు ఏర్పాటయ్యాయి.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన జైంట్‌వీల్, కోలంబస్

పెరిగిన రద్దీ..

రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తుల రాకతో వెంకటగిరిలో మంగళవారం నుంచి రద్దీ పెరిగింది. బుధవారానికి ఇది మరింత పెరిగే అవకాశముంది. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని సీఐ ఏవీ రమణ కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతరకు లక్షలాది మంది వస్తారని, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని కోరారు.

అమ్మవారి దర్శనం కోసం ఇలా..

పోలేరమ్మ దర్శనార్థం వచ్చే భక్తులకు పాత బస్టాండ్ మార్గం నుంచి రూ.100, రూ.200, రూ.300 క్యూలు ఏర్పాటు చేశారు. రూ.500 టికెట్ తీసుకున్న వారు రాజావీధి నుంచి పోలేరమ్మ ఆర్చి మీదుగా వెళ్లవచ్చు. వీఐపీలు రాజాకోట ముందు వాహనాలు పార్కింగ్ చేసి, ఆర్చి మీదుగా దర్శనానికి వెళ్లి తిరిగి అక్కడికే వస్తారు. ఈ మేరకు పోలీసులు మంగళవారం రూట్ మ్యాప్ విడుదల చేశారు.

ఆర్థిక సంక్షోభంలోనూ అభివృద్ధికి బాటలు: పాశిం



ఏరూరులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం, కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు, సెప్టెంబరు 24: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సమర్థవంతమైన నేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం చిల్లకూరు మండలంలోని ఏరూరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు సంక్షేమం, ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందిస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి ప్రతినెలా ఒకటవ తేదీనే అందజేస్తున్నారని కొనియాడారు. రూ.5లక్షలు ఉన్న చంద్రన్న బీమాను రూ.10 లక్షలకు పెంచారని తెలిపారు. దీపావళి నుంచి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఇళ్ల స్థలం లేని వారికి 18 అంకణాల ఇళ్ల స్థలం మంజూరుకు చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా పేదలు ఇళ్లు కట్టుకునేందుకు రూ.4.30 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం సమపాలనతో అందించాలని సూచించడం జరిగిందని, ఈ మేరకు అధికారులందరూ పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలోని వేరుశనగ పంటను పరిశీలించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, వ్యవసాయశాఖ జేడీ ప్రసాద్‌రావు, డీపీవో వాణిరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, నాయకులు వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటే శ్వర్లురెడ్డి, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్, పట్టాభిరామిరెడ్డి, మన్నెం శీనయ్య, గుండాల లీలావతి, సుప్రజ, శైలజ, చిరంజీవి, దువ్వూరు కృష్ణారెడ్డి, కీరవాణి, భైరప్ప, శివకుమార్, కుమార్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన సాగాలి: కురుగొండ్ల



శ్రీపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

దక్కిలి, సెప్టెంబరు 24: మండల స్థాయిలో పనిచేస్తున్న అధికారులందరూ అవినీతి రహిత పాలన సాగించాలని, ఎవరు ఎలాంటి అవినీతికి పాల్పడినా చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం శ్రీపురం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'కార్యక్రమం నిర్వహించారు. అలాగే పొలంబడి కార్యక్రమాన్ని, సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్కిలి పంచాయతీలో సర్పంచు అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అవినీతి, అక్రమాలకు ఎవరు పాల్పడ్డా క్షమించేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించాలని కృషిచేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా రూ.3 వేలు ఇస్తున్న పింఛనను రూ.4 వేలకు పెంచడం జరిగిందన్నారు. అలాగే ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు గుర్తుచేశారు. అంతేగాక ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందజేస్తున్నారని తెలిపారు. విజయవాడ వరదల సమయంలో సీఎం చంద్రబాబు ముంపు ప్రాంతాల్లో పర్యటించి అధికారులు స్వయంగా సహాయక చర్యలు తీసుకొనేలా ముందుండి నడిపించారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు, ఏపీవో లక్ష్మీనారాయణ, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున సాగర్, టీడీపీ నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పచ్చారి నరసయ్య నాయుడు, దక్కిలి చంద్రారెడ్డి, అయ్యపరెడ్డి, ఆరికట్ల శ్రీరాములు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూను రాజకీయం చేయడం తగదు

నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



కోట, సెప్టెంబరు 24: కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందంటూ ప్రచారం చేయడం మంచి పద్ధతికాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. కోట మండలం విద్యానగర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో ఏమి జరిగినా ఆలయ ఈవో, జేఈవోలదే బాధ్యత అన్నారు. 2019 - 2024 మధ్య నెయ్యిలో నాణ్యత లేదని 18 సార్లు ట్యాంకర్లను వెనక్కు పంపడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు శ్రీవారి లడ్డూను రాజకీయం చేయడం తగదని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

అవగాహనతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ

నాయుడుపేట, సెప్టెంబరు 24: దీర్ఘకాలిక వ్యాధులైన క్షయ, హెచ్ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా సోకకుండా నివారించవచ్చని నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. నాయుడుపేట సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం క్షయ, హెచ్ఐవీ పట్ల అవగాహన కల్పించారు. సంబంధిత సమస్యలు ఎవరికైనా ఉంటే 1097 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించి తగు సలహాలు, వైద్యసేవలు పొందవచ్చ న్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసింగాడు కుప్పంలో 'ఇది మంచి ప్రభుత్వం'

తడ, సెప్టెంబరు 24: మండల పరిధిలోని కాసింగాడు కుప్పంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ నాయకు లు కళానిధి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టబోయే కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేశారు. టీడీపీ నాయకులు రమేష్, అధికారులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు యువకుల అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ నరసింహమూర్తి

ఏర్పేడు, సెప్టెంబరు 24: ఏర్పేడులో సోమవారం అర్ధరాత్రి పోలీసులు 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఆవరణలో రేణిగుంట ఇన్‌చార్జి డీఎస్పీ నరసింహమూర్తి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏర్పేడు సీఐ జయచంద్ర తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి ఏర్పేడు-వెంకటగిరి క్రాస్‌లో తనిఖీలు చేపట్టారు. తిరుపతి భవానీ నగర్‌కు చెందిన టి.నరసింహ రోహిత్ (22), ఏర్పేడు మండలం మన్నసముద్రానికి చెందిన బి.నవీన్ బైక్‌లో వస్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. మేర్లపాక సమీపంలోని పద్మావతి హోటల్ వెనుక గంజాయి పొట్లాలుగా కట్టి ఏర్పేడులో విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. తిరుపతికి చెందిన మునిభరణి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నామని, ప్రస్తుతం అతను తిరుపతి జైలులో ఉన్నాడని చెప్పారు. నిందితుల నుంచి 22 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.9వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మునిభరణి గంజాయి ఎక్కడి నుంచి తెప్పిస్తున్నాడు.. ఎవరెవరికి విక్రయిస్తున్నాడు వంటి వివరాలపై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

2.3 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్

రేణిగుంట, సెప్టెంబరు 24: రేణిగుంటలో 2.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను గాజులమండ్యం పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం రేణిగుంట సంతగేటు వద్ద తిరుపతికి చెందిన సాయిప్రకాష్, మహమ్మద్ అనీష్‌ల మధ్య గంజాయి చేతులు మారుతుండగా పోలీసులు చేరుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులను పాత సర్వీసు రోడ్డులోనే నడపండి

రేణిగుంట, సెప్టెంబరు 24: ఆర్టీసీ బస్సులను పాత సర్వీసు రోడ్డులోనే నడపాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ చెంగల్‌రెడ్డికి ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి రవిబాబు తదితరులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రేణిగుంట మండలం దిగువమల్లవరం సుమారు 16 గ్రామల కూడలి అని ఈ ప్రాంతంలో హైవే నిర్మించడం వలన ఆర్టీసీ బస్సులు ఇక్కడ ఆగకుండా వెళ్లిపోతున్నాయన్నారు. మరోపక్క హైవే దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి ఉందని తెలిపారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ రీజినల్ మేనేజరు త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

ఏర్పేడు, సెప్టెంబరు 24: మండలంలో యువతి(20) అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు ఏర్పేడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తాము కూలి పనులకు వెళ్లామని పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చే సమయానికి తమ కుమార్తె ఇంటి వద్ద లేదన్నారు. బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు. ఈ మేరకు సీఐ జయచంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల అభివృద్ధి పనులను వేగవంతం చేయించండి

ఎమ్మెల్యేకు విన్నవించిన ఉద్యోగ సంఘ నాయకులు



ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగ సంఘ నాయకులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 24: నగరి నియోజకవర్గం వడమాలపేట సమీపంలో కేటాయించిన ఇళ్ల స్థలాల్లో అభివృద్ధి పనుల్లో జాప్యం నెలకొందని టీటీడీ ఎంప్లాయీ హౌసింగ్ సొసైటీ, టీటీడీ ఉద్యోగ సంఘం నాయకులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన్ను కలిసిన ఉద్యోగులు ఇళ్ల స్థలాల వద్ద నెలకొన్న ఇబ్బందులను వివరించారు. 5318 మంది ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన నిబంధనలకు మేరకు చెల్లించాల్సిన నగదును టీటీడీ ప్రభుత్వానికి చెల్లించిందని తెలియజేశారు. కాగా, భూసేకరణ ప్రక్రియలో చిన్న పాటి కుటుంబ తగాదాల కారణంగా జాప్యం నెలకొంటోందని తెలియజేశారు. సమస్యను దగ్గరుండి పరిష్కరించాలని విన్నవించారు. టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో అభివృద్ధి పనులు చేపట్టి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వెంకటేష్, నాగార్జున, వెంకటరమణారెడ్డి, భాస్కర్, గుణశేఖర్, ఇందిర, మహేష్, వాసు, రామచంద్ర తదితరులు ఉన్నారు.

విద్యా సామగ్రి వితరణ

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 24: పట్టణంలో కాపు వీధిలో ఉన్న మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే వీధికి చెందిన రమేష్ పురోహిత్, ధనలక్ష్మి దంపతులు రూ.15 వేల విలువైన విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ఆడిటర్ రామకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ ముంతాజ్, హెచ్ఎం మల్లికారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైదానం దారిని పునరుద్ధరించండి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 24: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం దారిని పునరుద్ధరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ కోరారు. వృద్ధులు, విద్యార్థులు మైదానానికి వస్తుంటారని రెండు రోజుల క్రితం దారిలో గోతులు తవ్వేశారన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించారు.

30న కాటూరు పీఏసీఎస్ మహాజన సభ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 24: ఈనెల 30న మధ్యాహ్నం 3గంటలకు కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మహాజన సభ నిర్వహిస్తున్నట్లు తిరుపతి అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి రవిబాబు, సీఈవో మహేష్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకు జరిగిన లావాదేవీలు, జమా ఖర్చులు నివేదిస్తామని చెప్పారు. అలాగే 2023 - 24 ఆడిట్ రిపోర్టర్‌ను పరిశీలించి ఆమోదిస్తామని చెప్పారు. ఈ మహాజన సభకు సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కనూ పాల్గొనాలని కోరారు.

ఏడుకొండలవాడా క్షమించు



ప్రాయశ్చిత దీక్ష చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: ఉప ముఖ్యమంత్రి పవన్ నిర్వహిస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. మండలంలోని తొండమానుపురం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణలో మంగళవారం దీక్ష చేశారు.ఈ సదర్భంగా వినుత మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం తిరుమలలో చేసిన తప్పిదాలకు ప్రాయశ్చిత్తంగా ఈ దీక్ష చేస్తున్నామన్నారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. చంద్రబాబు, వీర మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట నెరవేర్చిన ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాటను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నెరవేర్చారు. తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలిలో అంగన్‌వాడీ భవనం లేకపోవడంతో పశువుల కొట్టంలో నిర్వహించేవారు. ఈ విషయాన్ని స్థానికులు బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఎమ్మెల్యే అయిన తరువాత నూతన భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అంగన్‌వాడీ నూతన భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు.

టీడీపీతోనే మైనార్టీ జీవితాల్లో వెలుగులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: మైనార్టీల జీవితాల్లో టీడీపీతోనే వెలుగులు వస్తాయని ఆ పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ షాకీర్ అలీ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీ సంక్షేమ పథకాలను పునఃప్రారంభించిందన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన్ నిర్మాణంతో పాటు నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం మైనార్టీ వర్గాల అభ్యున్నతికి సోపానాలన్నారు.

ఆశా కార్యకర్తలపై వేధింపులు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశాలు ప్రజారోగ్యం కోసం ఎంతో కష్టపడి పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినపుడల్లా వారిని తొలగించాలని చూస్తున్నారన్నారు. అదే విధంగా కనీస వేతన చట్టం ప్రకారం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, లక్ష్మి, ఉషా, సరళ, చెంగాళమ్మ, రాణి, అను, సీఐటీయూ నాయకులు గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



బాలికల జూనియర్ కళాశాల వలంటీర్ల ర్యాలీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: పట్టణంలో పలు కళాశాలలు, విద్యా సంస్థల్లో ఎన్ఎస్ఎస్ డేను నిర్వహించారు. విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. తొట్టంబేడు బాలికల జూనియర్ కళాశాల వేడుకల్లో రేణుక, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **తొట్టంబేడు** మండలం డాక్టర్ సీఆర్‌రెడ్డి కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి.రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. కె.యశోద, పవిత్ర, వాలంటీర్లు పాల్గొన్నారు.

తిమ్మసముద్రంలో వీధిదీపాల ఏర్పాటు



కేవీబీపురం, సెప్టెంబరు 24: ఇటీవల కురిసిన వర్షాలు, గాలులకు మండలంలోని తిమ్మసముద్రంలోని వీధిదీపాలు దెబ్బతిన్నాయి. దీంతో సర్పంచ్ దొరబాబునాయుడు వీధుల్లో కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మత్తుకు బానిసలు కావద్దు



2కే రన్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 24: యువత మత్తుకు బానిసలు కావద్దని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులతో కలిసి మంగళవారం శ్రీసిటీలో 2కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నివారణ, రోడ్డు ప్రమాదాలు, మహిళా చట్టాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యుల నిర్లక్ష్యంతో ఆవు మృతి

పిచ్చాటూరు, సెప్టెంబరు 24: పశువైద్యులు సకాలంలో స్పందించకపోవడంతో తమ ఆవు మృతి చెందినట్లు రైతులు శివకుమార్, కావ్యరాణి ఆవేదన వ్యక్తం చేశారు. పిచ్చాటూరు తోపువీధికి చెందిన వీరు తమిళనాడులోని తిరువళ్లూరు వీర రాఘవులుస్వామి ఆలయానికి ఆవును దానం చేయడానికి తీసుకెళ్తూ అడవికొడియంబేడు వద్ద రాత్రి బస చేశారు. ఆవుకు కట్టిన దారం పెనవేసుకున్నట్టు గుర్తించిన రైతు మంగళవారం ఉదయం పశు వైద్య అంబులెన్స్ 1962కి ఫోన్ చేసి పరిస్థితి చెప్పినప్పటికీ వారు స్పందించలేదు. దీంతో ఆవు మృతి చెందినట్టు వారు చెప్పారు.

నిత్యావసరాల వితరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో వాచ్ మేన్‌కు సీపీఐ, సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు, జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలను, రూ.2వేలను వితరణ చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

రేణిగుంట, సెప్టెంబరు 24: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. మంగళవారం వెంకటాపురంలో బీజేపీ నాయకుడు వెంకటాద్రియాదవ్ విద్యార్థులతో వంద మొక్కలను నాటించారు. భాస్కరరావు, ఉదయ్‌రాజు, రవి, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇది ప్రజారంజక ప్రభుత్వం: ఎమ్మెల్యే సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: రాష్ట్రంలో జనం మెచ్చిన ప్రజారంజక ప్రభుత్వంతో మంచి పాలన సాగుతోందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కుర్తి, తొట్టంబేడు మండలం కన్నలి, పొయ్య గ్రామాల్లో మంగళవారం కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజుల పాలనలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఇది మంచి ప్రభుత్వం అన్న నినాదంతో ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ పాలన రాష్ట్రప్రజలకు పీడకలగా మిగిలిందన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పిందన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని మాజీ సీఎం జగన్ అతలాకుతలం చేసినప్పటికీ దార్శనిక నేత సీఎం చంద్రబాబు క్రమశిక్షణతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నారని చెప్పారు. పింఛన్లు, జీతాలు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు ఈ కోవలోకే వస్తాయన్నారు. దీపావళి నుంచి ఉచిత సిలిండర్ పథకం అమలవుతుందన్నారు. కర్యక్రమంలో టీడీపీ నా యకులు గాలి చలపతినాయుడు, గాలి మురళీనాయుడు, చెంచయ్య నాయుడు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా సత్యవేడు సర్వసభ్య సమావేశం

ప్రొటోకాల్ పాటించలేదని వైసీపీ సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతిమ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 24: సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ నేతృత్వంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడివేడిగా కొనసాగింది. ముందుగా మండల పరిషత్ కొలువుదీరి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి హాజరయ్యారు. అనంతరం మండలంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో జరిగిన పురోగతిని అధికారులు వివరించారు. ప్రొటోకాల్ పాటించకుండా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులకు సరైన సమాచారం ఇవ్వడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలకు ఇంత వరకు కూడా పరిష్కార చూపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సమస్యలను పరిష్కరించాలని తీర్మానించగా ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా సత్యవేడు మండలం దాసుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి బదిలీ అయిన జ్యోతి ఇంత వరకు రికార్డులు అప్పగించలేదని సర్పంచ్ రవిరెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. కాగా పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు టీవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

పిచ్చాటూరు, సెప్టెంబరు 24: మండలంలోని రామగిరి, అప్పంబట్టు గ్రామాల్లో మంగళవారం ఏవో సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రైతులతో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఆధునిక వ్యవ సాయ పద్ధతులు, సలహాలు, సూచనలతో పాటూ వేరుశనగ విత్తనశుద్ధి, వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల పిచికారి, రసాయన ఎరువుల వాడకం వివరించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి, ఆలత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏవో అజిత, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, సర్పంచ్ రామ్మూర్తి, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: మండలంలోని వేంబాక్కం, బైటకొడియంబేడుల్లో ఏవో సుబ్బారావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, జనసేన మండల అధ్యక్షుడు మణికంఠన్, టీడీపీ నాయకులు జాన్సన్, అన్బు, ఎస్ఎం సురేష్, తెన్నరసు, ఎండీ కుమార్, డాక్టర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని కళత్తూరుత, కాట్రపల్లిల్లో ఏవో మురళీకృష్ణకుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది.

వరదయ్యపాళెం: మండలంలో కువ్వాకొల్లి, వరదయ్యపాళెంలలో జరిగిన కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, జనసేన నాయకులు చిరంజీవి యాదవ్, ఏవో ద్వారకనాథ్‌రెడ్డి, ఏఎస్‌వో ప్రవీణ్‌కుమార్, వీఏఏ ప్రవీణ్‌కుమార్, ఎంపీఈవోలు సోనియా, పద్మ, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెం, పల్లం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ భాస్కరయ్య, ఏవో షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం: మండలంలోని పాలమంగళంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడం, తక్కువ నీటితో సాగుచేసే పంటల అవగాహన కల్పించారు. ఏవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న గ్యాస్ ట్యాంకర్

● ఒకరి పరిస్థితి విషమం





నుజ్జునుజ్జైన ఎడ్లబండి - చికిత్స పొందుతున్న మార్కండేయ

నాగలాపురం, సెప్టెంబరు 24: రెక్కాడితేగానీ డొక్కాడని ఓ రైతు తన కుటుంబ జీవనోపాధి కోసం తన ఎడ్లబండితో బయలు దేరాడు. ఇంతలో దారిలో ఊహించని ప్రమాదం జరిగి తల వెనుక ఎముకలు, వెన్నెముకకు తీవ్రగాయాలయ్యాయి. నాగలాపురం మండలంలోని చిన్నాపట్టుకి చెందిన మార్కండేయ బండి తోలి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వేకువ జామున చిన్నాపటు నుంచి సత్యవేడు మండలం దాసుకుప్పంలోని ఓ రైతు పొలంలో కూలీ పనుల నిమిత్తం తన ఎడ్లబండిలో బయలు దేరాడు. మార్గమధ్యంలో కారణి వద్ద కడప నుంచి తమిళనాడుకి వెళ్తున్న గ్యాస్ కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఎడ్ల బండి నుజ్జు నుజ్జయ్యింది. రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. ఎడ్ల బండిలో ఉన్న మార్కండేయ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్ సాయంతో తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడ క్షత గాత్రుడిని పరిశీలించిన వైద్యులు తల వెనుక ఎముకలు, వెన్నెముక దెబ్బతినిందని చెప్పారు. ఒకవేళ కోలుకున్నా పడకకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి ఉందని చెప్పడంతో వారి కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. దీనిపై కుటుంబ సభ్యులు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



వేలిముద్రల సేకరణలో క్లూస్‌టీం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో భారీ చోరీ జరిగింది. రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని హరహరబావి వీధికి చెందిన వరాహ నరసింహమూర్తి విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు. రెండురోజుల క్రితం ఈయన భార్యతో పాటు తిరుపతిలోని కుమారుడి ఇంటి వద్దకు వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నట్లు చుట్టుపక్కల ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకుని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది, క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. 134గ్రాముల బంగారు ఆభరణాలు, 1,050 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్ల సీఐ తెలిపారు.

లారీని ఢీకొన్న కారు: ఇద్దరికి తీవ్రగాయాలు

రేణిగుంట, సెప్టెంబరు 24: లారీని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న కారు మల్లవరం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని లారీ ముందుభాగంలో ఢీకొనింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు ఆటో ద్వారా స్థానిక బాలాజీ ఆస్పత్రికి తరలించారు.

రైతు మహాసభ దిగ్విజయం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో బలరామ జయంతిని పురస్కరించుకుని రైతు మహాసభను భారతీయ కిసాన్‌సంఘ్, శ్రీకాళహస్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, తొట్టంబేడు ఫార్మర్ ప్రొడ్యూసర్, కేవీబీపురం నైరూప్య ఫార్మర్ ప్రొడ్యూసర్ సంఘాల ఆధ్వర్యంలో రైతు మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన శరణానందస్వామి, శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సాగులో రైతుల తీసుకోవాల్సిన జాగ్రత్తలు సహా పలు అంశాలపై మాట్లాడారు.

వంద రోజుల్లో అభివృద్ధి అమోఘం





బీఎన్‌కండ్రిగ, నారాయణవనంలలో కరపత్రాల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 24: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో చేసిన అభివృద్ధి అమోఘమని టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు అన్నారు. బుచ్చినాయుడుకండ్రిగలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరప్రతాలు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు బాబు నాయుడు, కార్యదర్శి ఇందిరమ్మ, బీజేపీ నాయకుడు శివ పాల్గొన్నారు.

నారాయణవనం: రాష్ట్రంలో సమర్థవంత పాలన అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందని టీడీపీ నాయకుడు భాస్కరన్ అన్నారు. వీవర్స్ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. హరి, పరుశురామయ్య, మునిబాబు, రాము, ఆర్ముగం, మురుగన్, గిరి, వళ్లి, దేవ, వెంకటేశం తదితరులు పాల్గొన్నరు.

కేవీబీపురం: టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు ఆధ్వర్యంలో కళత్తూరు, ఎస్ఎన్‌కండ్రిగల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మునస్వామియాదవ్ ఆధ్వర్యంలో ఆరె, జ్ఞానాంబకండ్రిగ, కేవీబీపురంలల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగు రైతు అధ్యక్షుడు గోపినాథ రెడ్డి, సురేష్‌రెడ్డి, సర్పంచ్ సురేష్, వెంకటేష్, దొరబాబునాయుడు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24: స్కూల్ లెవల్ గేమ్స్‌లో పట్టణానికి చెందిన అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. వాసంతి 100 మీటర్ల పరుగు పందెం, హైజంప్‌లో మొదటి స్థానం, లాంగ్ జంప్‌లో రెండోస్థానం, షాట్‌పుట్‌లో మూడో స్థానంలో నిలిచింది. ఖోఖోలో లాలిత్య, వాసంతి, సింధు, భానుప్రియ, మునిలక్ష్మి, భార్గవి, మేఘన, దినేష, జాహ్నవి, ప్రతిభ చూపగా డిస్క్‌త్రోలో రక్షిత, చెస్‌లో శృతిగ్రేస్, కబడ్డీలో భావన ప్రతిభ చూపారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మంగళవారం ప్రిన్సిపాల్ ప్రభావతి అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



కేవీబీపురం, సెప్టెంబరు 24: మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు అంజూరులోని జడ్పీఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్‌లో విజేతలుగా, చెస్‌లో ద్వితీయ స్థానం, అండర్-14 బాలికల విభాగం కబడ్డీలో రన్నర్స్‌గా నిలిచారు. ప్రిన్సిపాల్ సుకన్య, పీఈటీ సతీసావిత్రి క్రీడాకారులను అభినందించారు.

ఆ వీధిలో అడుగడునా కంపే!



రేణిగుంట, సెప్టెంబరు 24: ఆ వీధిలో వెళ్లాలంటే కంపు భరించాల్సిందే. పంచాయతీలో నెల రోజులుగా మురుగునీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలోని మిరియాలబాబా వీధిలో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం పెరుకుపోయి మురుగు కదలడం లేదు. వర్షం వస్తే వాన నీటితో కలిసి మురుగు పల్లపు ప్రాంతాల్లోకి చేరుతోంది. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది అడపదడపా కాలువను శుభ్రం చేసి వదిలేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పారిశుధ్య సిబ్బంది స్పందించి మురుగ నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

నిబంధనల మేరకే లేఅవుట్లకు అనుమతులు

తుడా వైస్ చైర్మన్ మౌర్య



సూరప్పకశం తుడా లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మౌర్య

రేణిగుంట, సెప్టెంబరు 24: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఏర్పాటు చేస్తున్న లే అవుట్లకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని తుడా వైస్ చైర్మన్ మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం రేణిగుంటలోని సూరప్పకశంలో తుడా లే అవుట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుడా పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లను అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలన్నారు. సమర్పించిన ప్లాను ప్రకారం ఉన్నాయా లేవా అని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సీపీవో దేవికుమారి, ఏపీవో సూర్యనారాయణమ్మ, జేపీవోలు, ఇతర ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణపై ఇథియోపియా దేశస్థుల అధ్యయనం



ఇథోయోఫియా దేశస్థులకు మాతా శిశు సంరక్షణపై వివరిస్తున్న విజయలక్ష్మి

శ్రీకాళహస్తి/ బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 24: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఇథియోపియాకు చెందిన ప్రత్యేక వైద్య బృందం సందర్శించింది. మాతా శిశు సంరక్షణలో ఇక్కడ అనుసరిస్తున్న విధానాలపై వారు అధ్యయనం చేశారు. గైనకాలజిస్టు, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి వారికి ఏపీ మాతా శిశు సంరక్షణ కోసం అందిస్తున్న వైద్యసేవలపై అవగాహన కల్పించారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ఆస్పత్రిలో ప్రసవమై ఇంటికి వెళ్లే వరకు ప్రభుత్వం, ప్రభుత్వాస్పత్రిలో అందించే వైద్యసేవలను వివరించారు. శిశువు జన్మించిన తరువాత ఐదేళ్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రత్యేక చర్యలను వివరించారు. అనంతరం ఇథియోపియా దేశీయులు కాన్పుల వార్డు, మిడ్ విభాగాన్ని పరిశీలించారు. కాగా ఇదే బృందం బీఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. గర్భకోశ నిపుణులు, చిన్న పిల్లల వైద్యులు, సామాజిక ఆరోగ్య అధికారుల బృందం, ఎస్వీ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వాసిం, కమ్యూనిటీ డాక్టర్లు వినాయక్, హరి, వైష్ణవి తదితరులు ఆ బృందానికి అవగాహన కల్పించారు.

పొలం పత్రాల ఫోర్జరీపై ఎస్పీకి ఫిర్యాదు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 24: మండలంలోని కాంబాకం రెవెన్యూలో తమ పొలానికి సంబంధించి పత్రాలను కొందరు వ్యక్తులు దొంగ సంతకాలతో ఫోర్జరీ చేసి తమ పేరుతో మార్చుకుని తనను ఎస్పీ సుబ్బారాయుడికి రైతు గిరిధర్ మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఎస్పీ పరిశీలించి విచారించిన అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.